ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : నవంబర్ 24న జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు జిల్లాపరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో(రెసిడెన్షియల్ కానివి) 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 11 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఈవో శ్రీనివాస్ తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు, మిగతా వివరాల కోసం http//bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలో దరఖాస్తుల గడువు పెంపు

కాజీపేట, ఆగస్టు 13 : కాజీపేటలోని ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు మూడో దశ దరఖాస్తులకు ఈ నెల 17 వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, టర్నర్, స్టెనోగ్రాఫర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డ్రాఫ్‌మెన్ సివిల్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, ఐఎంసీ కోటా కింద కొన్ని పేమెంట్ సీట్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

లాండ్రోమార్ట్ నిర్వహణను త్వరగా చేపట్టాలి ■ మేయర్ సుధారాణి

వరంగల్, ఆగస్టు 13 : చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పోతనగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. లాండ్రోమార్ట్ నిర్వహణను త్వరగా చేపట్టాలని సూచించారు. సంఘాలతో చర్చించి మార్ట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఈఈ శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు కేటాయించాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : ప్రభుత్వం పెట్టుబడి సాయం వెంటనే అందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సాయం ఎకరాకు రూ.5వేల నుంచి రూ.7500 ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు కావొస్తున్నా నిధులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందికి గురవుతున్నారన్నారు. రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి, మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారని ఆరోపించారు. అసెంబ్లీలో రైతు భరోసాపై ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించాలని, వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

లైబ్రేరియన్‌కు సన్మానం

హసన్‌పర్తి, ఆగస్టు 13 : గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని కేయూలోని కేంద్ర గ్రంథాలయంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీ సురేశ్ ఆధ్వర్యంలో ఉత్తమ లైబ్రేరియన్ ఇంద్రసేనారెడ్డిని సన్మానించారు. లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ జీ షమితా, విభాగాధిపతి డాక్టర్ బీ రాధికారాణి, ప్రొఫెసర్ రమణయ్య, కొండల్‌రెడ్డి, కృష్ణమాచార్య పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి సమాజ సేవ శిక్ష

కాజీపేట, ఆగస్టు 13 : మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన ఇద్దరికి న్యాయస్థానంలో న్యాయమూర్తి రెండు రోజుల సమాజ సేవ చేయాలని శిక్ష వేసినట్లు కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మడికొండకు చెందిన కందుల నాగరాజు, బస్కె సురేశ్ పట్టుబడగా రెండవ శ్రేణి కోర్టులో వారిని హాజరుపరిచారు. దీంతో మద్యం సేవించి వాహనం నడపడాన్ని నేరంగా పరిగణిస్తూ ఆ ఇద్దరికి రెండు రోజులు సమాజ సేవ చేయాలని న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. దీంతో నాగరాజు, సురేశ్ ఇద్దరిని కాజీపేట తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

31న జాతీయ బృంద గీతాల పోటీలు

న్యూశాయంపేట, ఆగస్టు 13 : భారత్ వికాస్ పరిషత్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రేటర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు 31న బృంద గీతాల పోటీలను నిర్వహించనున్నట్లు బీవీపీ అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. హిం దీ, సంస్కృతంలో బీవీపీ అందజేసిన చేతనా కేశ్వర్ పాటల పుస్తకం నుంచి గేయంతో పా టు తెలుగు భాషా గీతం, జానపద గీతం పాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరి వాయిద్యాలు వారే తెచ్చుకోవాలని, పాటలు రాష్ట్రీయ, హిందుస్తానీ, కర్ణాట క, జానపద రీతిలోనే ఉండాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 22లోగా గీతాల కన్వీనర్ కమలా మనోహర్ 9440604347 నం బర్‌కు వివరాలను పంపించాలని కోరారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీఎన్జీవో నేతలు

నాయినిని కలిసిన టీఎన్జీవోలు

హనుమకొండ, ఆగస్టు 13 : ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వచ్చిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణు గోపాల్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్ సుందర్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు రాజామౌళి, సురేశ్, రాంప్రసాద్, రాజేశ్‌ఖన్నా, రాజేశ్వర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, రమేశ్, పవన్ కుమార్, సురేందర్, సదయ్య, దశరథ్, అనూప్, ప్రణయ్, గౌతమ్, శ్రీనివాస్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

కలెక్టర్ ప్రావీణ్య

పెరటి కోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఎల్కతుర్తి, ఆగస్టు 13 : మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. జీల్గుల గ్రామంలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పెరటి కోళ్ల పెంపకం యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఎల్కతుర్తి సహకార సొసైటీని సందర్శించి ఇటీవల రుణమాఫీ అయిన రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్, ఎరువుల గోదాంను పరిశీలించారు. ఇటీవల రుణమాఫీ అయిన రైతులకు మళ్లీ రుణాలను అందజేశారు. తర్వాత సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న తీరుపై ఆరా తీశారు. మండల ప్రత్యేకాధికారి నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, డీపీఎంలు ప్రవీణ్, శ్రీకాంత్, పశువైద్యాధికారిణి దీపిక, ఏపీఎం రవీందర్, ఏపీవో అనిత పాల్గొన్నారు.

కాజీపేట ఏసీపీ కార్యాలయ తనిఖీ

సుబేదారి, ఆగస్టు 13 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాజీపేట ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారం సీపీ అంబర్ కిశోర్‌ఝా తనిఖీ చేశారు. ఏసీపీ తిరుమల్, కాజీపేట డివిజన్ పరిధి ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని సీపీ హెచ్చరించారు.

కేయూ ప్రొఫెసర్లకు టీఏఎస్ ఫెలోషిప్స్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : కేయూలోని పలువురు ప్రొఫెసర్లు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్) ఫెల్లోషిప్‌లు అందుకున్నారు. ప్రొఫెసర్లు వెంకట్రామరెడ్డి (ఫిజిక్స్), ఎన్ ప్రసాద్ (ఫార్మసీ), టీ సవితా జ్యోత్స్న(కెమిస్ట్రీ), ఎస్ రామ్‌రెడ్డి(బోటనీ), టీ శాస్త్రి (బయో టెక్నాలజీ), అసోసియేట్ ఫెల్లోషిప్స్‌గా బీ మంజుల, డీ రమేశ్(కంప్యూటర్ సైన్సు), ఎన్ శ్రీధర్ (జియాలజి), రజినీకాంత్(బయో టెక్నాలజీ) ఫెల్లోషిప్స్ పత్రాలను హైదరాబాద్‌లో అందుకున్నారు.

ఎంఈడీ పరీక్ష కేంద్ర పరిశీలన

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : కేయూలోని విద్యాకాలేజీలో జరుగుతున్న ఎంఈడీ(రెండో సెమిస్టర్) పరీక్షల తీరుతెన్నులను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్ నరసింహాచారి మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీ నాగరాజు కూడా ఉన్నారు.

మొరం తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 13 : అక్రమంగా మొరం తరలిస్తున్న హిటాచీ, టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై పీ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కక్కిరాలపల్లి శివారులో లింగయ్యకుంట నుంచి అక్రమంగా హిటాచీ, టిప్పర్‌తో మొరం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. మొరం తవ్వుతున్న హిటాచీ, తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి, 50 టిప్పర్ల మొరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొరం దందాకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. తనిఖీల్లో ఎంఆర్ఐ రాణి, రాకేశ్, హేమచంద్ర, వీఆర్ఏలు వేణు, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత

శాయంపేట, ఆగస్టు 13 : మండలంలోని సూర్యనాయక్‌తండాలో శాయంపేట సీఐ రంజిత్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో లావుడ్యా రోజ, లావుడ్యా మానస, జరుపుల లచ్చుతో పాటు గంగిరేణిగూడెం తండాకు చెందిన బానోతు శోభన్ ఉన్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో శాయంపేట ఎస్సై ప్రమోద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఓవర్‌లోడ్ లారీలకు జరిమానా

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : వరంగల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గనులు, రవాణా, రాష్ట్ర పన్నుల శాఖ అధికారులతో సంయుక్తంగా హనుమకొండ జిల్లా పరిధిలో సోమవారం రాత్రి ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక, గ్రానైట్, గ్రావెల్ లారీలను పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. లారీలకు రూ.3.60 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

డ్రైవర్ వెంకన్నను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

మానవత్వం చాటిన డ్రైవర్‌కు సన్మానం

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : విధి నిర్వహణలో మానవత్వం చాటి ప్రయాణికుడి ప్రాణం కాపాడిన వరంగల్-2 డిపో డ్రైవర్ బీ వెంకన్నను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించి, ఘనంగా సన్మానించారు. డ్యూటీలో భాగంగా సూపర్ లగ్జరీ బస్సులో ఉప్పల్ రింగ్‌రోడ్ నుంచి వరంగల్ వచ్చే క్రమంలో బస్సులో ఒక ప్రయాణికుడికి ఫిట్స్ రావడంతో గమనించిన డ్రైవర్ వెంటనే సమీపంలోని దవాఖానకు తీసుకెళ్లి చేర్పించాడు. విషయం గురించి బస్సులో ఓ ప్రయాణికుడి ద్వారా తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హైదరాబాద్ బస్‌భవన్‌కు డ్రైవర్ వెంకన్నను పిలిపించి, అధికారులందరి సమక్షంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రీజినల్ మేనేజర్ డీ విజయభాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కే భానుకిరణ్, జీ మాధవరావు, వరంగల్-2 డిపో మేనేజర్ వీ జ్యోత్స్న, ఇతర అధికారులు డ్రైవర్ వెంకన్నను అభినందించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, దేశ రక్షణ విభాగానికి ఒక పునాది రాయిగా నిలుస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అన్నారు. కేయూలో ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపును ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ దేశ యువతకు దిక్సూచి ఎన్‌సీసీ అన్నారు. అనంతరం ఎన్‌సీసీ కెడెట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

శాయంపేటలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

శాయంపేట, ఆగస్టు 13 : శాయంపేటలోని పీహెచ్‌సీలో మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా 93 మంది రోగులను పరీక్షించినట్లు వైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు. వీరిలో ఐదుగురు పరుషులు, తొమ్మిది మంది మహిళలకు క్యాన్సర్‌ను గుర్తించి పెద్దాస్పత్రికి రెఫర్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చలపతి, ఐదుగురు ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలను చూపుతున్న ప్రకాశ్‌రెడ్డి దంపతులు

వికసించిన బ్రహ్మ కమలం

కాజీపేట, ఆగస్టు 13 : కాజీపేట ప్రశాంతనగర్‌లో సోమవారం అర్ధరాత్రి లెక్కల ప్రకాశ్ రెడ్డి స్వగృహంలో బ్రహ్మ కమలం పువ్వులు వికసించాయి. వీటిని తిలకించేందుకు కాలనీవాసులు భారీగా తరలివచ్చారు. పువ్వులు వికసిస్తుండగా మంగళ హారతులు పట్టారు. ఈ ఎడాది మొక్కకు ఒకే సమయంలో ఏడు పువ్వులు వికసించాయని ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలి

నయీంనగర్, ఆగస్టు 13 : విద్యార్థులు లక్ష్యం వైపు దృష్టి పెట్టాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో మోషన్ జూనియర్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లక్ష్మీనారాయణ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని విద్యార్థులు వారి కలలను సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ గణేశ్, శరత్, అనిల్, అధ్యాపకులు అనుజ్‌కపూర్, సాహిల్ కత్యాల్, మోహన్ మంగళం, ప్రదీప్, దమన్, అవినాశ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లక్ష్మీనారాయణ

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే , ఎంపీ

ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, ఆగస్టు 13 : పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మడికొండలోని రైతు వేదికలో 44, 45, 46, 64 డివిజన్ల పరిధిలోని గ్రామాలకు చెందిన 45 మంది బాధితులకు రూ.11లక్షల సీఎంఆర్ఎఫ్, 43 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాసరెడ్డి, మెట్టుగుట్ట ఆలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, రాజారపు స్వామి, నాయకులు బైరి లింగమూర్తి, వస్కుల నాగరాజు, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, కృష్ణ, యూత్ నాయకులు కర్ర హరీశ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నీలం రజిని తదితరులు పాల్గొన్నారు.

పార్కు సమస్యలు పరిష్కరిస్తాం

టెక్స్‌టైల్ పార్కులోని సభ్యుల సమస్యలను పరిష్కరిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మడికొండలోని పవర్ లూమ్ క్లస్టర్ ఆధ్వర్యంలో ఎస్ఐడీబీ క్లస్టర్ ఇంటర్వెన్షన్ సహకారంతో గ్రీన్ టెక్నాలజీ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్యతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి, మాట్లాడారు. సూరత్, సోలాపూర్ నుంచి వచ్చి ఇక్కడ యూనిట్లు స్థాపించిన నిర్వాహకులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏజీఎం స్మృతి, ప్రొఫెసర్ పద్మనాభం, గౌరవ అధ్యక్షుడు స్వామి, అధ్యక్షుడు శ్రీరాములు, సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్కతుర్తి : కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం తహసీల్దార్ జగత్‌సింగ్ పంపిణీ చేశారు. ఎల్కతుర్తి రైతువేదికలో 91మందికి చెక్కులు అందించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, డీటీ భద్రూనాయక్, ఏవో రాజ్‌కుమార్, ఆర్ఐ సదానందం, నాయకులు ఇంద్రసేనారెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సీపీ అంబర్ కిశోర్ ఝా

న్యూశాయంపేట : నిట్‌లో మాట్లాడుతున్న సీపీ

న్యూశాయంపేట, ఆగస్టు 13 : యువత మత్తు పదార్థాలతో పాటు ర్యాగింగ్ లాంటి చర్యలకు దూరంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, ర్యాగింగ్ పాల్పడం ద్వారా కలిగే నష్టాలపై కాజీపేట పోలీసుల ఆధ్వర్యంలో నిట్‌తో పాటు కిట్స్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీ పాల్గొని మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల నేడు యువత భవిష్యత్ ప్రమాదంలో ఉందన్నారు. క్షణికానందం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకు డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నా, రవాణా, విక్రయిస్తున్నా 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ తిరుమల్, నార్కోటిక్ విభాగం ఏసీపీ సైదులు, నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుద్ధి, కాజీపేట్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, నార్కోటిక్ విభాగం ఇన్‌స్పెక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

లష్కర్‌బజార్ పాఠశాలలో..

హనుమకొండ చౌరస్తా : లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాలు వద్దు..ఆరోగ్యమే ముద్దు' అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హనుమకొండ సీఐ వై సతీశ్‌కుమార్ పాల్గొని అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శి డీ తిరుపతి, గోపి, ఉపాధ్యాయులు నరేందర్, రెడ్డగుజ్జ వెంకటేశం, వీరభద్రం, నరేందర్, వీరప్రతాప్, రాజేంద్రన్, నరేందర్, రోజారాణి, శ్రీలత, అనిత, మాధవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాయంపేట జూనియర్ కాలేజీలో..

శాయంపేట : శాయంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు, మానసిక ఆందోళనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రహసిత్ పాల్గొని అవగాహన కల్పించారు. డాక్టర్ సాయికృష్ణ, హెచ్ఈవో వెంకటేశ్వరవర్మ, హెచ్ఏ చలపతి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కాజీపేట, ఆగస్టు 13 : రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. గురువారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చంచారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో 49 లక్షల మందికి రుణమాఫీ చేస్తామని చెప్పి రెండు విడుతల్లో 18 లక్షల మందకి మాత్రమే చేశారన్నారు. మూడో విడుత కలిపితే 23 లక్షల మంది రైతులకు మించరన్నారు. మిగతా రైతులకు మొండి చేయి చూపినట్లేనన్నారు. డొంకతిరుగుడు పరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చి రాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. రాష్ట్రంలోని పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో ఏడాదికి రెండు సార్లు 2.80కోట్ల మంది రైతులకు రూ.13వేల కోట్ల రైతు బంధు ఇచ్చారని గుర్తుచేశారు. రైతులను కన్నీళ్లు పెట్టిస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ విజయ చందర్‌రావు, డాక్టర్ కాళీప్రసాద్, నరహరి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తుదిదశకు నయీంనగర్ మోరీ పనులు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 13 : నయీంనగర్ పెద్దమోరీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పనులను ఆయన మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి మంగళవారం పరిశీలించారు. నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఇటు బ్రిడ్జి నిర్మాణ పనులు, సైడ్ కాలువ పనులు బ్రిడ్జికి ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. నిర్మాణ దశలో ప్రజలకు పాదాచార మార్గాన్ని కూడా అందుబాటులో ఉంచాలని, తాత్కాలిక ప్రజా రవాణాలో ఇబ్బంది లేక